సాక్షి ఖమ్మం

బుధవారం ၊ 23 ၊ జూలై ၊ 2025



‘ముగ్గు’ దాటని ఇల్లు

ఆషాఢంలో ముహూర్తాలు లేవని.. చేతిలో నగదు లేదంటూ పలువురు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మొదలుపెట్టడం లేదు. 8లో



తపాలా శాఖలో ఐటీ 2.0

పోస్టాఫీసుల్లో సేవలు మరింత వేగంగా అందించేలా సమకూర్చిన కొత్త సాఫ్ట్‌వేర్ మంగళవారం అందుబాటులోకి వచ్చింది. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకాశముంది. పలు ప్రాంతాల్లో రోజంతా వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

మున్నేరుకు జలకళ



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లా కేంద్రంలోని మున్నేటిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లోనే కాక ఎగువన మహబూబాబాద్ జిల్లాలోనూ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరద నీరు చేరగా ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యాం వద్ద మున్నేరు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నిండుకుండలా వైరా రిజర్వాయర్



వైరా రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులకు గాను మంగళవారం 18అడుగులకు చేరింది. ఎగువన భారీ వర్షాలతో వాగుల నుంచి వరద చేరడంతో ఒకేరోజు ఒకటిన్నర అడుగుల మేర నీటిమట్టం పెరగడంతో సాగుకు ఢోకా లేనట్లేనని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – వైరా

మధిర చెరువుకు అలుగు



మధిర నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండగా సిద్దినేనిగూడెం, మాటూరు, వంగవీడు, రాయపట్నం చెరువులకు నీరు చేరింది. మధిర పెద్ద చెరువు నిండి అలుగు పోస్తుండగా స్థానికులు చేపల వేటలో నిమగ్నమయ్యారు. మాటూరుపేటలోని వాగు ఉధృతితో వివిధ గ్రామాలకు రవాణా అంతరాయం ఏర్పడింది. – మధిర

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్ 1077



ఖమ్మంసహకారనగర్: భారీ వర్షాల నేపథ్యాన కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో ఈ కంట్రోల్ రూమ్‌లో 24గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని వెల్లడించారు. వరదలు, ఇతర విపత్తుల నేపథ్యాన ఎలాంటి సహకారం అవసరమైనా, ఆపదలో చిక్కుకున్న వారైనా 1077 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని కలెక్టర్ సూచించారు.

ఉద్యోగాల పేరిట ప్రచారాన్ని నమ్మకండి

ఖమ్మంవైద్యవిభాగం: ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు చేస్తున్న ప్రచారాన్ని నిరుద్యోగులు నమ్మొద్దని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు నగదు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయడం లేదనే విషయాన్ని గుర్తించి నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా ఉద్యోగ నియామకాలు అవసరమైతే కలెక్టర్ అనుమతితో నోటిఫికేషన్ ఇస్తామని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

ఎంత భూమి ఉన్నా యూరియా 4 బస్తాలే...



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కొణిజర్ల: రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. మండలంలోని తనికెళ్లలో ఫెర్టిలైజర్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేసిన ఆయన స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ ఎంత భూమి ఉన్న రైతులకైనా నాలుగు బస్తాలకు మించి యూరియా ఇవ్వొద్దని యజమానులకు సూచించారు. అలాగే, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుంటూ మండల రైతులకే అందించాలని తెలిపారు. కొందరు అదనంగా యూరియా తీసుకెళ్లి పాల తయారీ, చేపల చెరువుల అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు కూడా మోతాదుకు మించి యూరియా వాడకుండా నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని డీఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ డి.బాలాజీ పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో మెళకువలతో సురక్షిత ప్రయాణం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ డ్రైవర్లు ఎప్పటికప్పుడు విధుల్లో మెళకువలు పెంపొందించుకోవడం ద్వారా ప్రమాదాల సంఖ్య తగ్గడమే కాక ప్రయాణికుల మన్ననలు పొందొచ్చని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. ఇటీవల వివిధ చోట్ల ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు రెండు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణను ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక అంశాలపై పట్టు పెంచుకోవడం, డ్రైవింగ్‌లో మెళకువలపై అవగాహన సాధించడం ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చవచ్చని తెలిపారు. అనంతరం ఏసీపీ శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య పాల్గొన్నారు.

ఫీజు కట్టినా తిప్పలే..

మోక్షం లేని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

- యాజమాన్య హక్కుల కోసం ఐదేళ్లుగా ఎదురుచూపులు
- 26,790 మంది ఫీజు చెల్లిస్తే 8,401 మందికే ప్రొసీడింగ్స్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఎల్ఆర్ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తులకు పరిష్కారం లభించడం లేదు. ఐదేళ్లుగా స్థలంపై యాజమాన్య హక్కుల కోసం దరఖాస్తుదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అన్ని అడ్డంకులను దాటుకుని ఫీజు చెల్లించినా ప్రొసీడింగ్స్ జారీ కాక దరఖాస్తుదారులు ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రెగ్యులరైజ్ కోసం..

గతంలో చాలామంది అనుమతి లేకుండానే లేఔట్లు చేసి వెంచర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలియక పలువురు స్థలాలు కొనుగోలు చేయగా... యజమానులకు ఊరట లభించేలా స్థలాల రెగ్యులరైజ్‌కు అప్పటి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. 2020కి ముందు పలుమార్లు దరఖాస్తులు ఆహ్వానించినా మార్గదర్శకాలు విడుదల చేయలేదు. 2020లో మున్సిపల్ శాఖ 131 జీఓ విడుదల చేస్తూ ఆ ఏడాది ఆగస్టు 26కు ముందే స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ క్రమాన ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు.

మూడు దశల్లో పరిశీలన

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. ఎల్–1లో అర్బన్ ఏరియాలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఆఫీసర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనుమతులు, రెవెన్యూ అధికారులు స్థలం వివరాలను పరిశీలించగా, నీటిపారుదల శాఖ అధికారులు శిఖం భూముల్లో ఉన్నాయా అనేది చూడాలి. ఆపై ఎల్–2లో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ కంటే ఉన్నత స్థాయి ఉద్యోగి పరిశీలించి దరఖాస్తుకు జత చేసిన పత్రాలన్నీ సరిగ్గా ఉన్నాయా, లేదా అని ఆరా తీయాలి. ఒకవేళ ప్లాట్‌లో ఇల్లు కడితే సంబంధిత పట్టా చేయక పోతే వాటిని అందజేయాలని సమాచారం ఇస్తారు. ఈ దశ తర్వాత ఎల్–3కి పంపుతారు. అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులు, పత్రాలను మరోమారు పరిశీలించి నిర్దేశిత నగదును చలానాగా కట్టాలని దరఖాస్తుదారులకు సూచిస్తారు.

రూ.102 కోట్ల ఆదాయం

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపుల ద్వారా ప్రభుత్వానికి రూ.102.72 కోట్ల ఆదాయం లభించింది. ఖమ్మం కార్పొరేషన్, సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీలు, సుడా, గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 1,00,453దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 80,577 దరఖాస్తులు ఫీజు చెల్లింపునకు అర్హత సాధించినట్లు నిర్ధారించి స్థల యజమానులకు సమాచారం ఇచ్చారు. ఆపై ప్రభుత్వం 25శాతం రాయితీ ప్రకటించగా 26,790 మంది ఇప్పటివరకు ఫీజులు చెల్లించారు.

నత్తనడకన ప్రక్రియ

దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులకు ప్రొసీడింగ్స్ జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ఐదేళ్లుగా ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తుండగా.. చివరి దశలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫీజు చెల్లించాలని సమాచారం అందగానే దరఖాస్తుదారులు చలానా కడితే దరఖాస్తులను మరోసారి పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తారు. ఇదంతా పది రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ నెలలు గడుస్తున్నా దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ అందడం లేదు. జిల్లాలో మొత్తంగా 26,790 మంది ఫీజు చెల్లిస్తే కేవలం 8,401 మందికే ప్రొసీడింగ్స్ జారీ కావడం గమనార్హం. అయితే, ఫీజు చెల్లించాక దరఖాస్తులను మరోసారి పరిశీలించాల్సి వస్తుండడంతో సిబ్బంది కొరత కారణంగా కొంత ఆలస్యమవుతోందని అధికారికవర్గాలు చెబుతున్నాయి.

జిల్లాలో ఎల్ఆర్ఆర్ దరఖాస్తుల స్థితిగతులు...

సంస్థ	దరఖాస్తులు	ఫీజు చెల్లించింది	ప్రొసీడింగ్స్ జారీ అయినవి
ఖమ్మం కార్పొరేషన్	40,165	12,502	3,995
సత్తుపల్లి మున్సిపాలిటీ	3,695	654	559
మధిర	4,306	1,092	845
ఏదులాపురం	13,629	3,731	761
వైరా	3,535	728	460
సుడా	20,745	6,003	1,551
గ్రామపంచాయతీలు	14,378	2,080	230
మొత్తం	1,00,453	26790	8,401

డెయిరీ ఆధునికీకరణకు ప్రాధాన్యత

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



డెయిరీలో అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని పాడి పరిశ్రమ ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని పాడి పరిశ్రమ కార్యాలయం, యూనిట్‌ను మంగళవారం ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర పాడి పరిశ్రమ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 50ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాడి పరిశ్రమను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. డెయిరీలో సోలార్ యూనిట్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లుల భారం తగ్గగా, కేఎంసీ నుంచి నీటి సరఫరాకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే, డ్రెయిన్ల మళ్లింపు, ప్రహరీ నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అంతేకాక జిల్లాలో విజయ డెయిరీ చిల్లింగ్ యూనిట్ల ఆధునికీకరణకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ విజయ డెయిరీలో సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, డెయిరీ డీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాడి సంఘాల బలోపేతానికి ఎన్నికలు

తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వ పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తిదారుల సంక్షేమం దృష్ట్యా పాడి సహకార సంఘాల బలోపేతానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య లిమిటెడ్(విజయ డెయిరీ) మేనేజింగ్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని విజయ డెయిరీని మంగళవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. పాడి పరిశ్రమకు రాష్ట్రంలో 1,500 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు ఉండగా, ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సంస్థకు పాలు పోసే రైతులు 2లక్షల మంది ఉండగా, సహకార సంఘాల్లో అర్హులను సభ్యులుగా చేర్చాక 3 – 4 నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.

4.50లక్షల నుంచి 5.50లక్షల లీటర్లకు..

విజయ డెయిరీ ప్రస్తుతం లాభనష్టాలు లేని స్థితిలో కొనసాగుతోందని ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నిత్యం 4.50 లక్షల లీటర్ల పాలు సేకరిస్తుండగా, దీన్ని 5.50 లక్షల లీటర్లకు పెంచేలా కృషి జరుగుతోందన్నారు. విజయ పాలు, పాల ఉత్పత్తులకు ఆదరణ ఉన్నందున ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆస్పత్రులకు సరఫరా చేస్తూనే జనరల్ మార్కెట్‌లోనూ విక్రయాల పెంపునకు ప్రణాళిక రూపొందించామని వివరించారు. ఇందులో భాగంగా మహిళా సంఘాల ద్వారా రాష్ట్రంలో వెయ్యి పార్లర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాగా, లీటర్‌కు రూ.4 చొప్పున ఇచ్చే ప్రోత్సాహకాలు సుమారు రూ.15 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఖమ్మం విజయ డెయిరీలో ప్రస్తుతం ఉన్న యంత్రాల స్థానంలో కొత్తవి అమర్చడంతో పాటు ఇతర మార్పుల కోసం రూ.2.30 కోట్లు వెచ్చించనున్నట్లు ఎండీ వెల్లడించారు. ఇటీవల వరంగల్ డెయిరీకి సంబంధించిన పాలను ఖమ్మంలో విక్రయించినట్లు తేలిందని, మరోమారు ఇలా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే, షాపింగ్ కాంప్లెక్స్‌ను అద్దెకు ఇచ్చేందుకు వారంలో టెండర్లు నిర్వహిస్తామని ఎండీ పేర్కొన్నారు.

త్వరలో కాంగ్రెస్‌లోకి ‘కొండబాల’?



కొండబాల కోటేశ్వరరావు

మధిర: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది. మధిరకు సోమవారం వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన ఆయన పార్టీలో చేరికపై చర్చించినట్లు సమాచారం. ఉమ్మడి ఏపీలో మధిర ఎమ్మెల్యేగా గెలిచిన కోటేశ్వరరావు భద్రాచలం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా, డీసీసీబీ చైర్మన్‌గానూ పనిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. వివిధ పార్టీల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు ఖమ్మంలోని తన నివాసంలో మంగళవారం రాత్రి అనుచరులతో సంప్రదింపులు చేసినట్లు తెలిసింది. త్వరలోనే ముహూర్తం చూసుకుని అనుచరవర్గంతో కలిసి డిప్యూటీ సీఎం సమక్షాన కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాల సాధన

- భూసమస్యల పరిష్కారానికి ప్రణాళిక
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీఎస్ కె.రామకృష్ణారావు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం కలెక్టర్లతో సమీక్షించారు. ఖమ్మం నుంచి కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి పాల్గొనగా.. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కామేపల్లి, సింగరేణి మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత ఏర్పడితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులతో చర్చించాలని సూచించారు. అలాగే, సత్తుపల్లి మండలానికి ముల్కలపల్లి నుంచి ఇసుక రవాణా చేయించాలని తెలిపారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా మండల ప్రత్యేక అధికారులు భోజనం నాణ్యతను తనిఖీ చేయాలని చెప్పారు. అలాగే, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, వనమహోత్సవం విజయవంతానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, వివిధ శాఖల జిల్లా అధికారులు సన్యాసయ్య, ఆశాలత, కళావతిబాయి, శ్రీనివాస్, జి.జ్యోతి, శ్రీలత, కె.రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

రఘునాథపాలెం: విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదగాలంటే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆతర్వాత విద్యార్థులతో మాట్లాడి వారి లక్ష్యాలను తెలుసుకున్నాక గణిత పాఠం బోధిస్తూ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సైకిల్ నేర్చుకునేటప్పుడు పడడం ఎంత సాధారణమో చదువులోనూ అలాంటి ఆటంకాలు ఎదురైనా అధిగమించాలని సూచించారు. ఆతర్వాత మరుగుదొడ్లు, బీసీ హాస్టల్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. డీఈఓ ఎస్.సత్యనారాయణ, హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, మార్కెట్ చైర్మన్ హనుమంతరావు పాల్గొన్నారు.

మహాలక్ష్మి కటాక్షం

- అతివలకు కలిసొస్తున్న ఉచిత ప్రయాణం
- ఖమ్మం రీజియన్‌లో 7.38 కోట్ల ఉచిత ప్రయాణాలు
- తద్వారా రూ.331.05 కోట్ల చార్జీలు ఆదా
- నేడు సంబురాలకు ఏర్పాట్లు చేస్తున్న ఆర్టీసీ



తొలిరోజు మహిళలకు పూలు ఇస్తున్న ఉద్యోగులు



ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ‘మహాలక్ష్మి’ పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. 2023 డిసెంబర్ 9న ఈ పథకం అందుబాటులోకి రాగా ఇప్పటివరకు ఖమ్మం రీజియన్‌లో 7,38,14,406 మంది ఉచితంగా ప్రయాణించారని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన నేపథ్యాన బుధవారం సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఖమ్మం రీజియన్ వ్యాప్తంగా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో జరిగే ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

‘చిరు’ జీవితాల్లో వెలుగులు..

మహాలక్ష్మి ద్వారా కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం పేద మహిళలకు అండగా నిలుస్తోంది. ప్రయాణ ఖర్చులు లేకపోవడంతో ఆ వనరులను కుటుంబీకుల విద్య, ఆరోగ్యం, చిరు వ్యాపారాలకు మళ్లించగలుగుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగాలకు సిద్ధమవుతూ పట్టణాలకు వెళ్లి వచ్చే యువతులపై ఆర్థిక భారం తగ్గినట్లయింది. అలాగే, గ్రామీణ మహిళలు మెరుగైన వైద్యసేవల కోసం ఆస్పత్రులకు ఉచితంగా వెళ్లివస్తున్నారు. కూరగాయలు, పూలు, ఇతర చిరువ్యాపారాలు చేసే వారికి సైతం ఈ పథకం ఉపయోగపడుతోంది.

ఇప్పటివరకు రీజియన్‌లో మహాలక్ష్మి ప్రయాణికుల వివరాలు, వారికి ఆదా అయిన నగదు

డిపో	ప్రయాణించిన మహిళలు	ఆదా అయిన చార్జీలు (రూ.కోట్లలో)
ఖమ్మం	1,68,28,069	81.42
మధిర	67,76,202	48.69
సత్తుపల్లి	1,73,32,735	61.43
భద్రాచలం	82,99,912	41.14
కొత్తగూడెం	1,06,83,004	40.62
మణుగూరు	1,12,33,835	48.09
ఇల్లెందు	26,60,649	9.66
మొత్తం	7,38,14,406	331.05

ఆనందంగా ఉంది..



స్వయం సహాయక సంఘం తరఫున తయారుచేసే బనియన్ల అమ్మకానికి రోజుకో ఊరు వెళ్తాం. ఉచిత ప్రయాణంతో ఖర్చులు మిగులుతున్నాయి. వ్యాపారంలో రాణిస్తూ, ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యం ఉపయోగపడుతోంది. – గుండా తిరుపతమ్మ, కొర్లగూడెం, నేలకొండపల్లి మండలం

కష్టార్జితం మిగులుతోంది..



కుటుంబ పోషణ కోసం ఖమ్మంలోని పండ్ల దుకాణంలో పనిచేస్తున్నా. గతంలో బస్సు చార్జీ ఉండడంతో వచ్చే తక్కువ వేతనంలో కొంత ఖర్చయ్యేది. కానీ ఇప్పుడు ఉచితంగా ఆర్టీసీ బస్సులో వచ్చివెళ్తుండడంతో వేతనం ఆదా అయి ఇతర అవసరాలకు వెచ్చించగలుగుతున్నా. – పిట్టల దుర్గ, బోనకల్

మహిళల ముఖాల్లో చిరునవ్వులు



మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూస్తున్నాం. వారి దైనందిన జీవితాల్లో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఉచిత రవాణా మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా అండగా నిలుస్తోంది. – ఏ.సరిరామ్, రీజినల్ మేనేజర్, ఖమ్మం

క్లుప్తంగా

మొరాయించిన రైల్వేగేటు


గేట్‌కు ఇరువైపులా నిలిచిన వాహనాలు

కారేపల్లి: సాంకేతిక లోపంతో కారేపల్లి – ఇల్లెందు రైల్వేలైన్‌లోని గేట్ మంగళవారం మొరాయించింది. దీంతో అరగంట పాటు వాహనాల రాకపోకలకు ఆటంకం ఎదురైంది. గతంలో ఇక్కడ వీల్ పద్ధతిలో గేటు నిర్వహణ ఉండగా, వైరు తెగిపోయినప్పుడు సమస్య ఎదురయ్యేది. దీంతో అధికారులు ఇటీవల హైడ్రాలిక్ గేట్ ఏర్పాటు చేశారు. ఇది సైతం సాంకేతికలోపంతో మొరాయిస్తోంది. మంగళవారం కూడా ఇలాగే జరగడంతో నిత్యం రద్దీగా ఉండే కారేపల్లి – ఇల్లెందు మార్గంలో వాహనదారులు అర గంటకు పైగా నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు సిబ్బంది సరిచేయడంతో గేట్ తెరుచుకోగా రాకపోకలు మొదలయ్యాయి.

26న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికకు ఈనెల 26న పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలు, పురుషులు, మహిళలకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో రిపోర్టు చేయాలని సూచించారు. ఆగస్టు 3న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఇక్కడ జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బుధవారం నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ(ఎన్‌డీ), పీడీఎస్‌ఎస్(మాస్‌లైన్) జిల్లా కార్యదర్శులు టి.ప్రవీణ్, రామకృష్ణ, మస్తాన్, వెంకటేష్ కోరారు. ఖమ్మంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేలా చట్టాన్ని తీసుకురావడమేకాక పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్‌తో బుధవారం బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈమేరకు అన్నివర్గాల వారు సహకరించాలని కోరారు.సమావేశంలో ఎస్ ఎఫ్ఐ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సుధాకర్, లక్ష్మణ్‌తో పాటు మధు, రాజు, వరుణ్, వినోద్, త్రినాథ్, లోకేష్, మనోజ్, లక్ష్మీనారాయణ, అనిల్, స్టాలిన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వెంటిలేటర్ల మాయంపై విచారణ

ఆరుగురితో కమిటీ నియామకం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి ఐసీయూ, కార్డియాలజీ విభాగం నుంచి రెండు వెంటిలేటర్లు కానరాకపోవడంపై అధికారులు విచారిస్తున్నారు. వెంటిలేటర్లను ఎవరైనా తీసుకెళ్లారా, ఇతర విభాగాల్లో ఉన్నాయా అనేది తేల్చేందుకు ఆరుగురితో కమిటీని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్ మంగళవారం ఏర్పాటుచేశారు. ఆర్ఎంఓ, ఇద్దరు ప్రొఫెసర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్, ఏడీ, బయోమెడికల్ ఇంజనీర్‌తో కూడిన ఈ కమిటీ మూడు రోజుల్లోగా నిగ్గుతేల్చాల్సి ఉంటుంది. కరోనా సమయాన కేంద్రప్రభుత్వ నిధులతో పది వెంటిలేటర్లను కొనుగోలు చేయగా, ఇటీవల సర్వీసింగ్‌కు వచ్చిన కంపెనీ ప్రతినిధులు రెండు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. దీంతో అప్పటి మెడికల్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఆస్పత్రి వీవీపీ నుంచి డీఎంఈ పరిధిలోకి వచ్చినప్పుడు అన్నీ అప్పగించామని స్పష్టం చేయగా ఎక్కడ వెతికినా వెంటిలేటర్ల ఆచూకీ తేలలేదు. దీంతో వివిధ సమయాల్లో కొనుగోలు చేసిన 50కి పైగా వెంటిలేటర్లను బ్యాచ్‌లు, కంపెనీల వారీగా పరిశీలించి కానరాకుండా పోయిన రెండు ఏమయ్యాయో తేల్చేందుకు కమిటీని ఏర్పాటు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,300	1,500
ఏసీ మిర్చి	13,700	8,000
మిర్చి	8,500	5,800
పత్తి	7,925	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,463

‘ముగ్గు’ దాటని ఇల్లు


సత్తుపల్లిలో ఇంటి నిర్మాణానికి చదును చేసి వదిలేసిన స్థలం

- జిల్లాలో 15,478 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- ఆషాఢంలో నిర్మాణానికి లబ్ధిదారుల అనాసక్తి
- శ్రావణం వస్తేనే జోరందుకోనున్న పనులు

సత్తుపల్లిటౌన్: పేదల సొంతింటి కల సాకారానికి ఆషాఢం అడ్డొచ్చింది. రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ పేరిట నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో అర్హులు పలువురికి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ పత్రాలు అందుకున్న 45 రోజుల్లోగా ఇంటి నిర్మాణం మొదలుపెట్టాలనేది నిబంధన. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయనుండగా, బిల్లులు దశల వారీగా జమ చేస్తారు. కానీ ముందుగా నిర్మాణ పనులకు స్థోమత లేకపోవడం.. ఇంకోపక్క వ్యవసాయ పనులు మొదలవడం, మరోపక్క ఆషాఢం రావడంతో నిర్మాణాలు చాలాచోట్ల ప్రారంభం కావడం లేదు.

అవగాహన కల్పిస్తున్నా..

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్లేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా ఆశించిన స్థాయిలో నిర్మాణ పనులు జరగడం లేదు. జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 15,478 మంది ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇందులో 8,951 ఇళ్లు మాత్రం వివిధ దశల్లో ఉన్నాయి. మిగతా 6,527 ఇళ్ల ఆర్థిక స్థోమతకు తోడు ఆషాఢం ప్రభావంతో ముందుకు సాగడం లేదు. ముహూర్తం కోసం వేచి చూస్తుండడంతో శ్రావణమాసం వస్తే తప్ప పనులు మొదలయ్యే అవకాశం కనిపించడం లేదు.

శంకుస్థాపనతోనే సరి...

జిల్లాలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభిస్తారు. పూజలు చేసి ముగ్గు పోస్తున్నా ఆషాఢం కారణంతో చాలా మంది పనులు ప్రారంభించడం లేదు. దీంతో 45రోజుల్లోగా పని మొ దలుపెట్టకపోతే రద్దయ్యే ప్రమాదం ఉందని అధి కారులు కల్పిస్తున్నారు. అయినప్పటికీ రకరకాల కారణాలతో దాటవేస్తుండగా మరో నాలుగు రోజుల్లో మొ ద లయ్యే శ్రావణమాసం కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

గడువులోగా మొదలుపెట్టాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గడువు లోగా ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టాలి. ముహూర్తాలు చూసుకుంటే గడువు దాటే ప్రమాదముంది. ఈ విషయమై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. లబ్ధిదారులు కూడా ముందుకొస్తేనే ఫలితం ఉంటుంది. – శ్రీనివాస్, పీడీ, గృహనిర్మాణ శాఖ

నియోజకవర్గాల వారీగా ఇళ్ల వివరాలు			
నియోజకవర్గం	మంజూరు	వివిధ దశల్లో ఉన్నవి	మొదలు పెట్టనవి
ఖమ్మం	2,913	454	2,459
మధిర	2,754	959	1,795
పాలేరు	3,447	2,868	579
సత్తుపల్లి	3,456	2,933	523
వైరా	2,908	1,737	1,171

తపాలా శాఖలో ఐటీ 2.0 సేవలు

తొలిరోజు అక్కడక్కడా సాంకేతిక సమస్యలు


ఖమ్మం హెడ్ పోస్టాఫీసులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖలో ఐటీ–2.0 సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సురక్షితంగా, వేగంగా వినియోగదారులకు సేవలు అందించమే లక్ష్యంగా తపాలా శాఖ కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఇప్పటికే కర్ణాటకతో పాటు హైదరాబాద్ సర్కిల్‌లో అమలవుతున్న విధానాన్ని మంగళవారం మిగతాచోట్ల ప్రారంభించగా, ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలోనూ అమల్లోకి వచ్చింది. డివిజనల్ కార్యాలయంతో పాటు పది సబ్ డివిజన్ కార్యాలయాలు, ఖమ్మం, కొత్తగూడం, భద్రాచలం హెడ్ పోస్టాఫీసులు, 70 సబ్ పోస్టాఫీసులు, 750 బ్రాంచిల్లో ఐటీ–2.0 ద్వారా పొదుపు పథకాలు, డిపాజిట్లు, బీమా, ఐపీపీబీ బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నారు.

పలు బ్రాంచ్‌ల్లో సర్వర్ సమస్య

తొలిసారి తపాలా కార్యాలయాల్లో ఐటీ–2.0 సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి రాగా ఖమ్మం డివిజన్‌లోని పలు బ్రాంచ్‌ల్లో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. మారుమూల బ్రాంచ్‌ల్లో నెట్‌వర్క్ సమస్య కారణంగా ఈ సమస్య ఎదురుకాగా, ఖమ్మం పరిసర ప్రాంతాల్లోని బ్రాంచ్ కార్యాలయాల్లో సమస్య ఎదురైనట్లు తెలిసింది. దీంతో ఉద్యోగులు సమీప బ్రాంచ్‌ల ద్వారా సేవలందించారు. ఈ సందర్భంగా పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి మాట్లాడుతూ పలుచోట్ల సాంకేతిక సమస్యలు ఎదురైనా, వాటిని సరిచేస్తున్నామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో నూతన సాఫ్ట్‌వేర్ పూర్తిగా అమల్లోకి వస్తుందని వెల్లడించారు.

యువతీ, యువకుడు ఆత్మహత్య

ప్రేమ పెళ్లి సాధ్యం కాదని బలవన్మరణం?


శ్రీకాంత్ (ఫైల్)


హారిక (ఫైల్)

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన యువతీ, యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గాడిపల్లి శ్రీకాంత్(24) డిగ్రీ పూర్తిచేసి ఆటోట్రాలీ డ్రైవర్‌గా కొనసాగుతున్నాడు. ఆయన ఇంటి పక్కనే ఉండే బండి హారిక(19) పదో తరగతి పూర్తయ్యాక చదువు మానేసి వ్యవసాయ కూలీ పనులకు వెళ్తోంది. వీరిద్దరు కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారని సమాచారం. అయితే, కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించని కారణంగా మనస్తాపానికి గురైనట్లు తెలిసింది. ఈనేపథ్యాన హారిక(19) ఇంట్లో ఎవరూ లేని సమయాన మంగళవారం ఉరి వేసుకుంది. ఈ విషయం తెలిసి ఆందోళనకు గురైన శ్రీకాంత్ పంట చేను వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. దీంతో పండితాపురంలో విషాదం నెలకొనగా ఇద్దరి మృతదేహాలను పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

నెలల తర్వాత కుటుంబం చెంతకు...

తమిళనాడు వాసిని అప్పగించిన ‘అన్నం’


మణిని కుటుంబ సభ్యులకు అప్పగించిన శ్రీనివాసరావు

ఖమ్మం అర్బన్: మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తిని చేరదీసిన ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ బాధ్యులు సపర్యలు చేయడంతో కోలుకోగా.. ఆయన స్వస్థలం తమిళనాడుగా గుర్తించి కుటుంబీకులకు అప్పగించారు. 2024 డిసెంబర్ 23న ఖమ్మం లకారం పార్క్ వద్ద ఓ వ్యక్తి అర్ధనగ్నంగా తిరుగుతూ రాళ్లు రువ్వుతుండడంతో ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అన్నం సేవా ఫౌండేషన్‌కు అప్పగించారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు నేతృత్వాన చికిత్స చేయిస్తుండగా కోలుకోవడంతో తన పేరు మణి అని, తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లా విదుతలైపురం గ్రామ వాసిగా చెప్పాడు. ఈమేరకు ఈనెల 21న ఖమ్మం నుండి అంబులెన్స్‌లో మణిని తీసుకెళ్లి మంగళవారం భార్య లలిత, కుమారుడు మోహన్‌కు అప్పగించారు. దీంతో వారు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు మెట్టు బుజ్జిబాబు, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అప్పగింత

మధిర: మధిర స్టేషన్ సమీపాన మతిస్థిమితం లేని వ్యక్తి తిరుగుతుండగా రైల్వే పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించారు. కామారెడ్డి జిల్లా లింగాపూర్‌కు చెందిన గొల్ల భూమయ్య (80) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో రైలు ఎక్కి మధిర చేరుకున్నాడు. స్టేషన్ సమీపంలోని చెట్ల వద్ద కూర్చోగా రైల్వే కీమెన్ ఇచ్చిన సమాచారంతో సూపరింటెండెంట్ సుధీర్ బాబు, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కలిసి ఆర్‌కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ సహకారంతో అనాథాశ్రమానికి తరలించారు. ఈమేరకు భూమయ్యకు చికిత్స చేయించగా కోలుకుని వివరాలు చెప్పడంతో వారికి సమాచారం ఇవ్వగా ఆయన కుమారులు మంగళవారం మధిర వచ్చారు. దీంతో భూమయ్యను అప్పగించగా రైల్వే ఉద్యోగులు, ఆర్‌కే ఫౌండేషన్ బాధ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో కేసులో జైలుశిక్ష

నర్సింహులపేట: పోక్సో కేసులో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు జడ్జి మహ్మద్‌రఫీ మంగళవారం తీర్పు వెలువరించారు. నాలుగేళ్ల క్రితం నర్సింహులపేటలో ఖమ్మం జిల్లాకు చెందిన బానోత్ నవీన్‌పై పోక్సో కేసు నమోదైంది. వాదనలు విన్నాక నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, రూ.17 వేల జరిమానా విధించారని నర్సింహులపేట ఎస్సై సురేశ్ తెలిపారు.

డివైడర్ ఎక్కిన డీసీఎం

ఖమ్మం అర్బన్: ఖమ్మం గోపాలపురం వద్ద మంగళవారం రాత్రి అదుపు తప్పిన ఓ డీసీఎం డివైడర్‌పైకి ఎక్కగా త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. వైరా నుంచి ఖమ్మం వైపు వస్తున్న డీసీఎం బొక్కాయి సెంటర్ వద్ద కారును తప్పించే క్రమాన అదుపు తప్పి డివైడర్ వైపు దూసుకెళ్లింది. ఆపై ఐమాస్ట్ లైట్ల స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో స్తంభం విరిగి పడగా వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

చట్టప్రకారం ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ

జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం వైద్యవిభాగం: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారమే ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ కొనసాగాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వహణ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలును పర్యవేక్షిస్తామని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే పరీక్షలు చేసినట్లు తేలితే జైలు శిక్ష, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే, ఆస్పత్రుల నిర్వహణలో నాణ్యత, భద్రత, లైసెన్సులు తీసుకోవడంపై సూచనలు చేశారు. అంతేకాక సాధారణ ప్రసవాలు పెంపునకు కృషి చేయాలని ఆమె తెలిపారు. డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి, అధికారులు వెంకటరమణ, చందునాయక్, రామారావు, సుబ్బారావు, బిందుశ్రీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో నిరంతరం పర్యవేక్షణ


అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

జిల్లాలోని పీహెచ్‌సీలను అధికారులు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి సూచించారు. ఖమ్మంలో మంగళవారం ఆమె సీజనల్, కీటక జనీత వ్యాధులు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ సేవలు, పాముకాటు, కుక్కకాటు మందులపై ప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. ప్రోగ్రాం అధికా రులు, వైద్యులు, సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయకుండా.. మందుల అవసరంపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రజల్లో అవగాహన పెంచాలని, గర్భిణులు, చిన్నారులకు వంద శాతం వ్యాక్సిన్లు వేయాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్ఓ బిందుశ్రీ, అధికారులు చందునాయక్, సుబ్బారావు, వెంకటరమణ, రామారావు, మోతియా, సుబ్రహ్మణ్యం, శేషపద్మ, నవీన్, దుర్గ, నాగరాజు, నర్సయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై యువకుడి హత్యాయత్నం

బాకీ తీర్చాలని అడగడమే కారణం

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడులో ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన యువకుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వివాహిత రేలచర్ల పద్మావతి(58) అదే గ్రామానికి చెందిన రేలచర్ల నర్సయ్యకు రూ.4.50లక్షల నగదు అప్పుగా ఇచ్చింది. ఈ నగదు తిరిగి ఇవ్వాలని అడుగుతుండగా, ఆమెను చంపితే బాకీ చెల్లించాల్సిన అవసరముండదని నర్సయ్య భావించాడు. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి ఆమె ఇంట్లో ఒంటరిగా ఉందనే సమాచారంతో ఆయన వెళ్లి దిండుతో ఆమె తలపై అదిమిపెట్టి హత్యకు యత్నించాడు. ఈక్రమంలో పద్మావతి ప్రతిఘటించి నర్సయ్యను నెట్టేసి కేకలు వేయడంతో నర్సయ్య పరారయ్యాడు. ఘటనపై బాధితురాలు మంగళవారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఖమ్మం అర్బన్: ముదిగొండ మండలం గంధసిరి నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఖమ్మం అర్బన్ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్‌ను గుర్తించామని సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు.

7.5కేజీల గంజాయితో పట్టుబడిన బాలుడు

సత్తుపల్లి: జల్సాలకు అలవాటు పడి చోరీ చేసిన మోటార్ సైకిల్‌పై గంజాయి తీసుకొస్తున్న బాలుడిని సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. బాలుడి నుంచి 7.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా కల్లూరు ఏసీపీ అనిసెట్టి రఘు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం దేవునిచెరువు ప్రాంతానికి చెందిన 17ఏళ్ల బాలుడు సూర్యాపేట, మధిరకు చెందిన స్నేహితులతో కలిసి ఏలూరు, విజయవాడలో మోటారు సైకిళ్లు చోరీ చేశాడు. ఇందులో ఒక బైక్‌పై ఒడిశా వెళ్లి గంజాయి కొనుగోలు చేశాక బాలుడు బైక్‌పై, మిగతా ఇద్దరు బస్సులో బయలుదేరారు. బాలుడు సత్తుపల్లిలో అర్బన్ పార్క్ వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడగా జువైనల్ కోర్టుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సత్తుపల్లి సీఐ టి.శ్రీహరి, ఎస్సై ప్రదీప్ పాల్గొన్నారు.


కూసుమంచి : కోక్యాతండా వద్ద పొలాల్లోకి చేరిన వర్షపు నీరు

వర్షం.. ఆగమాగం

జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి మొదలైన వర్షం మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఆ తర్వాత కాస్త తెరిపినిచ్చినా మధ్యాహ్నం తర్వాత వర్షం మొదలై రాత్రి వరకు కొనసాగుతోంది. జోరువానతో పలు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. అలాగే, వాగులు ఉప్పొంగి లోలెవల్ చప్టాలపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

- **నేలకొండపల్లి:** మండలంలోని మోటాపురం ఎస్సీ కాలనీని వరద ముంచెత్తింది. పలువురు ఇళ్లలోకి నీరు చేరడంతో బియ్యం, నిత్యావసర సామగ్రి తడిసి ముద్దయ్యాయి. ఇంటి నిండా నీరు చేరడంతో నిద్రించే పరిస్థితి లేక మంచాలపై కూర్చుని జాగారం చేస్తున్నారు.
- **కారేపల్లి :** మండల కేంద్రంలోని పలు కాలనీల రహదారులపైకి వర్షపు నీరు చేరింది. రావోజీతండా గ్రామంలో బానోతు నాగేష్, ప్రమీల దంపతుల రేకుల ఇంట్లోకి మోకాలి లోతు నీర చేరడంతో ఇబ్బంది పడ్డారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో పుట్ట కోటమ్మకు చెందిన ఇంటి రేకులు పగలడంతో సామగ్రి తడిసి ముద్దయ్యాయి.
- **కూసుమంచి:** మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి చేలన్నీ జలమయమయ్యాయి. పొలాల్లో చేరిన వరద చెరువులను తలపిస్తోంది. ఇక పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరుతుండగా మరోపక్క వరద నీరు కూడా వస్తోంది. సాగర్ నుండి 780 క్యూసెక్కులు, వరదతో 500 క్యూసెక్కులు వస్తుండడంతో మంగళవారం సాయంత్రానికి రిజర్వాయర్ నీటిమట్టం 14.25 అడుగులుగా నమోదైంది.
- **బోనకల్:** మండలంలోని గోవిందాపురం(ఎల్) రైతువేదిక ఆవరణ వర్షపు నీటితో నిండింది. రైతువేదిక లోతట్టు ప్రాంతంలో నిర్మించడంతో నీరు ఎటు వెళ్లే మార్గం కానరావడం లేదు. ఇక మండలంలోని చిన్నబీరవల్లి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా రాకపోకలు నిలిపివేశారు.
- **తల్లాడ:** మండలంలోని నూతనకల్ –వెంగన్నపేట మధ్య కల్లూరు వాగు ఉధృతితో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇక రామచంద్రాపురం ఎన్ఎస్‌పీ మేజర్ కాల్వలో చెత్త, గడ్డి అడ్డుగా ఉండడంతో గండి పడింది. దీంతో పక్కనే పంట పొలాల్లోకి వరద చేరుతోంది. కాగా, వెంగన్నపేట, బిల్లుపాడు వాగులను ఎంపీడీఓ సురేష్‌బాబు సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.


బోనకల్ : గోవిందాపురం రైతువేదికలో నిలిచిన వరద


బోనకల్ : చిన్నబీరవల్లిలో పెద్దవాగు ఉధృతి


నేలకొండపల్లి : మోటాపురం ఎస్సీ కాలనీలోని ఓ ఇంట్లోకి చేరిన వరద


కారేపల్లి : రావోజీ తండాలోని ఇంట్లో వరద


తల్లాడ : కాల్వకు గండితో పొలాల్లోకి వెళ్తున్న నీరు

పంటల సాగుకు ఊతం

ఖమ్మంవ్యవసాయం: జిల్లావ్యాప్తంగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం 8–30 నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలో సగటున 45.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఏన్కూరు, చింతకాని, సత్తుపల్లి, బోనకల్ మండలాల్లో 60 – 72 మి.మీ. మేర వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. ఇక మంగళవారం ఉదయం 8–30నుంచి రాత్రి 8గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా కూసుమంచిలో అత్యధికంగా 51.8మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ వానలతో జలాశయాల్లో నీటిమట్టం పెరుగుతుండగా.. పంటల సాగుకు ఊతమిందని రైతులు చెబుతున్నారు.

రేపు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభ


కలెక్టర్ అనుదీప్‌తో యూనియన్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్(టీయూడబ్ల్యూజే – ఐజేయూ) జిల్లా మహాసభలు ఈనెల 24న వైరాలో జరగనున్నాయి. ఈ ఈమేరకు జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు. కాగా, సభలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, కె.రాం నారాయణ పాల్గొననుండగా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించామని తెలిపారు. కాగా, మంగళవారం వైరాలో సభ ఏర్పాట్లను నాయకులు పరిశీలించాక కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్‌దత్‌కు ఆహ్వానపత్రికలు అందజేశారు. యూనియన్ రాష్ట్ర, జిల్లా నా యకులు మా టేటి వేణుగోపాల్‌రావు, సామినేని మురారి, నర్వనేని వెంకట్రావు, నల్లజాల వెంకట్రావు, మైసపాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధనా చారి, ఏలూరి వేణు, కళ్యాణ్, బుర్రి శ్రీని వాస్, కొత్త వెంకటేశ్వరరావు, రాజారావు, శ్రీను, రవి పాల్గొన్నారు.